## 235వ అధ్యాయం

## ٢٣٥ - بَابُ بَيَانِ جَمَاعَةٍ مِنَ الشُّهَدَاءِ فِي ثَوَابِ الآخِـرَةِ وَيُغَسَّلُـونَ وَيُصَلَّـى عَلَيْهِـمْ بِخِلاَفِ القَتِيلِ فِي حَرْبِ الكُفَّارِ

**పరలోకంలో లభించే పుణ్యం రీత్యా అమరగతులుగా పేర్కొనబడేవారి భౌతిక కాయాలకు, గుస్ల్ (స్నానం) చేయించి వారి జనాజా నమాజు కూడా చేయటం జరుగుతుంది. వీరికి భిన్నంగా అవిశ్వాసులతో యుద్ధం చేస్తూ అమరగతి నొందినవారి భౌతిక కాయాలకు స్నానం చేయించనవసరం లేదు. జనాజా నమాజు కూడా చేయనవసరం లేదు.**

١٣٥٤ - عنْ أبي هُرَيْرَةَ، رَضِيَ اللهُ عَنْهُ قالَ: قالَ رَسُولُ اللهِ ﷺ: «الشُّهَدَاءُ خَمسَةٌ: المطْعُونُ والمَبْطُونُ، وَالغَرِيقُ، وَصاحِبُ الهَدْمِ، وَالشَّهِيدُ في سَبيلِ اللهِ» متفقٌ عليهِ.

1354. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: (పరలోకంలో పొందే పుణ్యం రీత్యా) అమరగతులు (షహీదులు)గా భావింపబడేవారు ఐదుగురు. 1) ప్లేగు వ్యాధితో చనిపోయినవాడు. 2) ఉదరవ్యాధితో చనిపోయిన వాడు. 3) (నీటిలో) మునిగి చనిపోయేవాడు. 4) బరువు క్రింద నలిగి చనిపోయినవాడు. 5) దైవమార్గంలో పోరాడుతూ ప్రాణాలు కోల్పోయినవాడు. (బుఖారీ-ముస్లిం)

### ముఖ్యాంశాలు

అమరగతుణ్ణి అరబీ భాషలో 'షహీద్' అని అంటారు. షహీద్ అనే పదానికి ధాతువు 'షహాదత్' (సాక్ష్యం) అయినా కావచ్చు లేదా 'షహూద్' (హాజరవటం) అయినా కావచ్చు.

సాక్ష్యం అనే అర్థంలో తీసుకుంటే దైవమార్గంలో అమరగతినొందేవానికి స్వర్గం లభిస్తుందని స్వయంగా దేవుడు మరియు దైవప్రవక్తలే సాక్ష్యం చెప్పారు. కనుక అతన్ని 'షహీద్' అని అనటం జరిగింది. ఒకవేళ 'హాజరుకావటం' అనే అర్థంలో తీసుకుంటే దైవమార్గంలో అమరగతినొందేవాని వద్దకు కారుణ్యదూతలు హాజరవుతారనీ లేదా తనే స్వయంగా యుద్ధభూమికి హాజరై దైవసన్నిధిలో ప్రాణార్పణం చేస్తాడు కనుక అతణ్ణి 'షహీద్' అని పిలవటం జరుగుతుందని అర్థం చేసుకోవాలి.

ప్లేగువ్యాధితో చనిపోయినవారు, ఉదరవ్యాధితో చనిపోయినవారు, నీళ్లలో మునిగి చనిపోయినవారు, బరువు క్రింద పడి నలిగి చనిపోయినవారు- ఈ నాలుగు రకాలవారు వాస్తవానికి అమరగతులు (షహీదులు) కాకపోయినా దేవుడు ప్రత్యేక కరుణాకటాక్షాలతో వారిని అమరగతుల స్థాయికి చేర్చి వారికి కూడా అంతటి పుణ్యాన్ని ప్రసాదిస్తాడు. ఇతర హదీసుల ద్వారా అమరగతుల జాబితాలోకి వచ్చేవారు మరికొందరున్నారని తెలుస్తున్నది. వివిధ హదీసుల్లో ఈ అమరగతుల రకాల సంఖ్య వేర్వేరుగా ఉండటం వల్ల పైకి ఈ హదీసులు పరస్పర విరుద్ధంగా ఉన్నట్లు కన్పిస్తాయి. వాస్తవానికి వాటి మధ్య ఎలాంటి వైరుధ్యం లేదు. ముందుగా దైవప్రవక్త (సల్లం) కు వహీ ద్వారా ఐదు రకాల అమరగతుల గురించి తెలుప బడింది. వాటిని ఆయన తన సహచరులకు బోధించారు. ఆ తర్వాత దేవుడు ఆ జాబితాలో మరికొందరిని చేర్చాడు. దైవప్రవక్త (సల్లం) వాటిని కూడా తన సహచరులకు వివరించారు. ఈ అమరగతుల్లో దైవమార్గంలో పోరాడుతూ వధింపబడినవాడు సిసలైన అమరగతుడు (షహీద్) కనుక అతనికి ఇతరుల మీద స్పష్టమైన ఆధిక్యత ఉంటుంది.

١٣٥٥ ـ وعنهُ قالَ: قالَ رسولُ اللهِ ﷺ: «ما تَعُدُّونَ الشُّهَداءَ فِيكُم؟» قالُوا: يا رَسُولَ اللهِ! مَنْ قُتِلَ في سَبيلِ اللهِ، فهُوَ شهيدٌ. قال: «إنَّ شُهَداءَ أُمَّتي إذاً لَقَليلٌ!» قالُوا: فَمَنْ يا رَسُولَ اللهِ؟ قالَ: «مَنْ قُتِلَ في سَبيلِ اللهِ فهُوَ شَهيدٌ، وَمَنْ مَاتَ في سَبيلِ اللهِ فهُوَ شَهيدٌ، وَمَنْ مَاتَ في الطَّاعُونِ فهُوَ شَهيدٌ، وَمَنْ مَاتَ في البَطْنِ فَهُوَ شَهيدٌ، وَالغَريقُ شَهيدٌ» رواهُ مُسْلمٌ.

1355. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: ఓ రోజు దైవప్రవక్త (సల్లం) తన సహచరుల్ని ఉద్దేశించి, "మీరు మీలో ఎవరెవరిని అమరగతులుగా పరిగణి స్తున్నారు" అని అడిగారు. "దైవప్రవక్తా! (మా అభిప్రాయంలో) దైవమార్గంలో పోరాడుతూ వధింపబడినవాడే అమర గతుడు" అని బదులిచ్చారు సహచ రులు. అది విని దైవప్రవక్త (సల్లం) "ఆ విధంగా చూస్తే నా అనుచర సమాజంలో అమరగతులు చాలా తక్కువ మంది ఉంటారు" అని అన్నారు. అందుకు సహచరులు,

"దైవప్రవక్తా! మరయితే అమరగతులు ఎవర్ని అంటారు?" అని అడిగారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా వివరించారు:

"దైవమార్గంలో పోరాడుతూ వధింపబడినవారు అమరగతులు. దైవమార్గంలో సహజమరణం పొందినవారూ అమరగతులే. ప్లేగువ్యాధితో చనిపోయినవారు కూడా అమరగతులే. అలాగే ఉదరవ్యాధితో చనిపోయినవారు, నీళ్ళలో మునిగి ప్రాణాలు కోల్పోయినవారూ అమరగతులే."

(ముస్లిం)

(సహీహ్ ముస్లింలోని పదవుల ప్రకరణం)

## ముఖ్యాంశాలు

దైవమార్గంలో సహజ మరణం పొందినవారంటే యుద్ధభూమిలో కత్తిపోట్లకో లేక ఖడ్గపు వేట్లకో లేక తుపాకీ గుండ్ల దెబ్బకో చనిపోకుండా వేరితర కారణాలతో చనిపోవటం అని అర్థం. ఉదా: జిహాద్‌కు వెళ్తూ మార్గమధ్యంలో గుర్రం లేక వేరితర వాహనంపై నుంచి క్రిందపడి ప్రాణాలు కోల్పోవటం లేక గుండెపోటు మొదలగు వ్యాధుల వల్ల మరణించటం.

١٣٥٦ ـ وعنْ عبدِ اللهِ بنِ عَمْرِو بنِ العاصِ، رَضِيَ اللهُ عَنْهُمَا قالَ: قالَ رسولُ اللهِ ﷺ: «مَنْ قُتِلَ دُونَ مالِه، فَهُوَ شَهيدٌ» متفقٌ عليهِ.

1356. హ్జ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: తన ధనాన్ని కాపాడుకునే ప్రయత్నంలో ఇతరుల చేత వధించబడినవాడు అమరగతునిగా పరిగణించబడతాడు. (బుఖారీ- ముస్లిం)

(సహీహ్ బుఖారీలోని దౌర్జన్యాల ప్రకరణం - సహీహ్ ముస్లింలోని విశ్వాస ప్రకరణం)

١٣٥٧ - وعَنْ أبي الأعْوَرِ سَعيدِ بنِ زَيْدِ بنِ عمرِو بنِ نُفَيْلٍ، أَحَدِ العَشَرَةِ المَشْهُودِ لهُمْ بالجَنَّةِ، رَضِيَ اللهُ عَنْهُمْ، قالَ: سَمِعْتُ رسُولَ اللهِ ﷺ، يقولُ: «مَنْ قُتِلَ دُونَ مالِهِ فَهُوَ شَهيدٌ، وَمَنْ قُتِلَ دُونَ دَمِهِ فَهُوَ شَهيدٌ، وَمَنْ قُتِلَ دُونَ دِينِهِ فَهُوَ شَهيدٌ، وَمَنْ قُتِلَ دُونَ أَهْلِهِ فَهُوَ شَهيدٌ». رواهُ أبو داوُدَ، والترمذي وقال: حديثٌ حسنٌ صحيحٌ.

1357. దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచిస్తుండగా తాను విన్నానని హజ్రత్ అబుల్ అవర్ సయీద్ బిన్ జైద్ బిన్ అమ్ర్ బిన్ నుఫైల్ తెలియజేశారు: తమకు స్వర్గం లభిస్తుందని ఇహ లోకంలోనే శుభవార్త పొందిన పది మందిలో ఈయన కూడా ఒకరు:

"తన ధనాన్ని కాపాడుకునే ప్రయత్నంలో ఇతరులచేత వధింపబడిన వాడు అమరగతుడౌతాడు. ఆత్మరక్షణ కోసం పోరాడుతూ వధింప బడినవాడూ అమరగతు డౌతాడు. తన ధర్మాన్ని కాపాడుకునే ప్రయత్నంలో వధింప బడినవాడు కూడా అమర గతుడౌతాడు. తన ఇంటివారిని రక్షించే ప్రయత్నంలో వధింపబడినవాడూ అమర గతునిగా పరిగణించబడ తాడు." (అబూ దావూద్, తిర్మిజీ- హసన్; సహీహ్)

(సుననె అబూదావూద్‌లోని సున్నహ్ ప్రకరణం - సుననె తిర్మిజీలోని రక్తపరిహారాల అధ్యాయం)

## ముఖ్యాంశాలు

ఇహలోకంలోనే స్వర్గసుఖాల శుభవార్తను పొందిన పదిమంది దైవప్రవక్త సహచరుల పేర్లు ఇవి: 1) అబూబక్ర్ సిద్దీఖ్ 2) ఉమర్ బిన్ ఖత్తాబ్ 3) ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ 4) అలీ బిన్ అబూతాలిబ్ 5) తల్హా బిన్ ఉబైదుల్లాహ్ 6) జుబైర్ బిన్ అవ్వామ్ 7) అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ 8) సాద్ బిన్ అబూ వఖ్ఖాస్ 9) అబూ ఉబైదా బిన్ జర్రాహ్ 10) ఈ హదీసు ఉల్లేఖకులైన సయీద్ బిన్ జైద్ (రజి). దైవప్రవక్త (సల్లం) మరికొంత మందికి కూడా స్వర్గశుభవార్తను తెలియజేశారు. అయితే ఈ పదిమందినే 'అషరయె ముబష్షరహ్' (స్వర్గశుభవార్త పొందిన పదిమంది)గా ఎందుకు చెబుతారంటే వీరందరికీ ఒకే సందర్భంలో ఒకే హదీసులోనే దైవప్రవక్త (సల్లం) స్వర్గశుభవార్త వినిపించారు (సుననె తిర్మిజీ).

١٣٥٨ - وعنْ أبي هُريرةَ، رَضِيَ اللهُ عَنهُ، قالَ: جَاءَ رَجُلٌ إلى رسولِ اللهِ ﷺ، فقَالَ: يا رسولَ اللهِ أرَأيتَ إنْ جاءَ رَجُلٌ يُرِيدُ أخذَ مالي؟ قالَ: «فلا تُعْطِهِ مَالَكَ» قال: أرَأيتَ إنْ قَاتَلَني؟ قال: «قَاتِلْهُ» قالَ: أرَأيتَ إنْ قَتَلَني؟ قالَ: «فَأنتَ شَهيدٌ» قالَ: أرَأيتَ إنْ قَتَلْتُهُ؟ قال: «هُوَ في النَّارِ» رواهُ مسلمٌ.

1358. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వచ్చి "దైవప్రవక్తా! ఎవరయినా బలవంతంగా నా సొమ్ము తీసుకోవటానికి వస్తే ఏం చెయ్యాలి?" అని అడిగాడు. "నీ సొమ్ము అతనికి ఇవ్వమాకు" అని బదులిచ్చారు దైవప్రవక్త (సల్లం). "ఒకవేళ అతను నాతో తలపడితేనో?" అని అడిగాడా వ్యక్తి. "నువ్వు కూడా అతనితో తలపడు" చెప్పారాయన. "ఆ పోరులో అతను నన్ను హతమారుస్తే?" అడిగాడా వ్యక్తి. "నువ్వు అమర గతునిగా పరిగణించ బడతావు" చెప్పారాయన. "ఒకవేళ నేనే అతన్ని హత మారిస్తే?" మళ్ళీ అడిగాడా వ్యక్తి. అందుకాయన సమాధానమిస్తూ "(నీకేం ఫర్వాలేదు) అతనే నరకానికి వెళ్తాడు" అని చెప్పారు. (ముస్లిం)

(సహీహ్ ముస్లింలోని విశ్వాస ప్రకరణం)

## ముఖ్యాంశాలు

ఆత్మరక్షణ కోసం, తమ ధనాన్ని రక్షించుకోవటం కోసం దోపిడీ దొంగలతో పోరాడి తప్పని పరిస్థితుల్లో వారిని హతమార్చితే అందులో తప్పులేదని ఈ హదీసు ద్వారా బోధపడుతోంది. ఆ విధంగా ఆత్మరక్షణ కోసం ఇతరుల్ని చంపినవారు నేరస్థులుగా కూడా పరిగణించబడరు. వారికి ఎలాంటి పాపం ఉండబోదు. పైగా హతులే నరకానికి వెళ్తారు. ఒకవేళ ఆత్మరక్షణ పోరాటంలో తనే మృత్యువాత పడితే అతను అమరగతుని (షహీద్)గా పరిగణించబడతాడు. అయితే ఇలాంటివారు సిసలైన అమరగతులు కారు. దేవుడు పరలోకంలో వీరికి ప్రత్యేక అనుగ్రహంతో అమరగతుల స్థాయిని ప్రసాదిస్తాడు. అంతే! కనుక సాధారణ మృతులకు చేసినట్లుగానే వీరికి కూడా శవస్నానం చేయించి జనాజా నమాజు చేయాల్సిందే. వీరికి భిన్నంగా యుద్ధభూమిలో అవిశ్వాసులతో పోరాడుతూ వధింపబడిన అమరవీరులకు మాత్రం శవస్నానంగాని, జనాజా నమాజ్‌గాని చేయాల్సిన అవసరంలేదు.